క్లుప్తంగా

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక



నాగకార్తీక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాణ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి నాగకార్తీక్ జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాములు నాయక్ సోమవారం తెలిపారు. ఈ నెల 6,7వ తేదీల్లో ఏలూరు జిల్లా ద్వారక తిరుమలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొన్నాడని చెప్పారు. అండర్-14, 16 విభాగాల్లో ప్రతిభ చాటి 5వ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్ఎంతోపాటు యోగా మాస్టర్ ప్రతాప్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పవన్ తదితరులు అభినందించారు.

ట్యాంక్ నిర్మాణంలో నాణ్యత పాటించాలి



సి.బెళగల్లో ట్యాంక్ నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: గ్రామాల్లో చేపట్టే మంచి నీటి ట్యాంక్‌ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహ్మద్‌ఖాన్ సూచించారు. ఆయన సోమవారం క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ మహేశ్వరి, స్థానిక ఏఈ గోనేనాయక్‌తో కలిసి సి.బెళగల్‌లో పర్యటించి ట్యాంక్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. గ్రామంలోని కొటారుమిట్ట ప్రాంతంలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ. 90 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో నీటి ట్యాంక్, పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నారు. సోమవారం ట్యాంక్ బాటం స్లాబ్ నిర్మాణ పనులు జరుగుతుండగా పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ నిర్మాణం నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

పాఠశాలకు కుర్చీల విరాళం



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న గ్రామ పెద్దలు

పాణ్యం: మండల పరిధిలోని వడ్డుగండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి మురళీశర్మ రూ.15 వేల విలువైన నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, 10 కుర్చీలు విరాళంగా అందించారు. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న మురళీశర్మ, తన తండ్రి క్రీ.శే ఈశ్వరయ్య జ్ఞాపకార్థం తాను చదువుకున్న పాఠశాలకు ఈ సాయాన్ని గ్రామ పెద్దల ద్వారా అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఎంఈఓ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం శ్రీదేవి, గ్రామ పెద్దలు మోహన్, నీరుకట్టు రాముడు, ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సి.బెళగల్‌లో రీసర్వే పూర్తి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో రెవెన్యూ అధికారులు చేపట్టిన భూముల రీసర్వే పూర్తయినట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. సోమవారం సి.బెళగల్- 2 గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించి రీసర్వే వివరాలను వెల్లడించారు. గ్రామంలో రీసర్వేకు ముందు 853 సర్వే నంబర్లలో 10,056 ఎకరాల విస్తీర్ణం ఉందన్నారు. భూముల రీసర్వే అనంతరం 10,033 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు తేల్చారు. ప్రభుత్వ భూమి 2,707 ఎకరాలు, పట్టా భూమి 7,326 ఎకరాలు ఉండగా, భూములకు 6,704 ఎల్‌పీఎంలను కేటాయించినట్లు తహసీల్దార్ వెల్లడించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు గౌరి, వెంకటేశ్వర్లు, సర్వే సహాయకులు శ్రీకాంత్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి

కల్లూరు: రైతులు పంటల సాగులో నానో ఎరువులు వినియోగించేలా అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారిని వరలక్ష్మి సూచించారు. సోమవారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో సిటిజన్ ఔట్రీచ్ ప్రోగ్రాం కార్యక్రమంలో నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించారు. సాధారణ యూరియాతో పోల్చితే నానో యూరియా తక్కువ మోతాదులో సరిపోతుందని తెలిపారు. పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. పంటలు మంచి దిగుబడులు ఇస్తాయన్నారు. సాగు చేసిన పంటను తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఏడీఏ శ్రీవర్ధన్‌రెడ్డి, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంటాడుతున్న యూరియా కష్టాలు

- గడివేముల మండలంలో అరకొరగా నిల్వలు
- ఒక్కో రైతుకు బస్తా మాత్రమే పంపిణీ
- నచ్చిన వారికి ఎన్నైనా యూరియా బస్తాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు





కరిమద్దెల రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

గడివేముల: మండల రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు యూరియా అరకొరగా సరఫరా చేస్తుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులు అధికంగా వరిసాగు చేస్తారు. వరికి సకాలంలో యూరియా వేస్తేనే మంచి దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. అయితే సీజన్ ప్రారంభం నుంచి యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు మాత్రం యూరియా కొరత లేదని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వారానికో పదిరోజులకో ఒకసారి అరకొరగా యూరియా వస్తుండడంతో టీడీపీ నాయకులు చెప్పిన వారికి మాత్రమే యూరియాను ఎక్కువ శాతం అందజేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. టీడీపీ నాయకులు, వారి అనుచరులు తీసుకున్న అనంతరం గ్రామంలోని రైతులకు కేవలం ఒక్క బస్తా అందజేస్తున్నారు. దీంతో రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్క బస్తా యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్క బస్తా యూరియా ఇస్తే ఏం లేయాలో అర్థం కాక కొందరు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. కరిమద్దెల గ్రామానికి యూరియా వచ్చినా టీడీపీ నాయకులు చెప్పిన వారికే పంపిణీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో టోకెన్లను పంపిణీ చేసి మధ్యాహ్నం అనంతరం ఒక్క బస్తా చొప్పున పంపిణీ చేశారు. పంటలకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో ఉంచలేని ప్రభుత్వంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి యూరియాను వరి రైతులకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

యూరియా కోసం తిప్పలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి యూరియా కోసం అడుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో టీడీపీ నాయకులు చెప్పిన రైతులకు మాత్రమే ఒక్క బస్తా చొప్పున పంపిణీ చేస్తున్నారు. అన్నదాతలను ప్రభుత్వం విస్మరిస్తోంది.

– పుల్లయ్య, కరిమద్దెల

అన్నదాత పోరును విజయవంతం చేయండి

సి.బెళగల్: రైతన్నలకు బాసటగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు నేడు కర్నూలులో చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నరసింహుడు పిలుపునిచ్చారు. సోమవారం సి.బెళగల్‌లో ఆ పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నాయకుల సమావేశంలో నరసింహుడు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఎరువులు బ్లాక్ మార్కెట్లకు తరలిపోతుండంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తోందని, ఇందులో భాగంగా మంగళవారం కర్నూలులో అన్నదాత పోరు కార్యక్రమం ద్వారా నిరసన తెలపనున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 9 గంటలకు కర్నూలులోని చిన్న పార్కు నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ డాక్టర్ విభాగం అధ్యక్షుడు హరుణ్, మండల కార్యదర్శులు వెంకటేష్, గోపాల్, నాయకులు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రైతులకు రాజకీయాలు ఆపాదించడం దారుణం



తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన రైతులు ఏ రాజకీయ పార్టీకీ చెందిన వారు కాదని, వారిని పంటనష్ట బాధిత రైతులుగా గుర్తించి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నరసింహుడు కోరారు. మండలంలోని పోలకల్ గ్రామంలో ఉల్లికి గిట్టుబాటు ధరలు లభించడం లేదని మనోవేదనతో ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం చేయగా, కూటమి నాయకులు బాధిత రైతులను వైఎస్సార్‌సీపీకి చెందిన వారుగా ముద్ర వేశారని, ప్రభుత్వం బాధితులపైనే కేసులు నమోదు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సోమవారం పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సభ్యులు, నాయకులతో కలిసి తహసీల్దార్ వెంకటలక్ష్మికి అర్జీ ఇచ్చారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. సర్పంచ్ పాండురంగన్న, నాయకులు మద్దిలేటి, గోపాల్, హరున్, చిన్నకొండయ్య, పులిరాజు, లచ్చప్ప, బాలరాజు, దస్తగిరి, రామకృష్ణ, గోవిందు తదితరులు ఉన్నారు.

నానో ఎరువులపై అవగాహన



వ్యవసాయ సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

సి.బెళగల్: మండల రైతులకు నానో యూరియా, డీఏపీలపై అవగాహన కల్పించాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో కోడుమూరు హెచ్ఓ మధుసూదన్‌గౌడ్‌తో కలిసి మండల వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో సమీక్ష నిర్వహించారు. నానో ఎరువుల వినియోగం గురించి సిబ్బందికి తెలియజేశారు. రైతులు నానో ఎరువులను వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని, పంటల నమోదుతోనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని మల్లేష్‌కుమార్ అన్నారు. హెచ్ఓ మాట్లాడుతూ.. ఉద్యాన పంటలైన ఉల్లి, మిరప, టమాట వంటి పండ్లు, కూరగాయలు సాగు చేసిన రైతులు సైతం ఈ పంటలో నమోదు చేసుకోవాలన్నారు. సిబ్బంది రైతుల సమస్యలను తెలుసుకుని, పంటల సాగుపై వారికి అవసరమైన సమాచారం, సూచనలను తెలియజేయాలని హెచ్ఓ అన్నారు. ఏఈఓ హిమబిందు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం అధికారులు పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది పోలీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సోమవారం స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ ప్రసాద్ పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పోలీస్ శాఖ నుంచి పరిశీలనకు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీటీ పురుషోత్తం, ఆర్ఐ తరుణ్‌తో కుల, ఆదాయ సర్టిఫికెట్లను తనిఖీ చేయించారు. సి.బెళగల్‌కు చెందిన విజయ్, వెంకటేష్, పోలకల్‌కు చెందిన మునెప్ప, బ్రాహ్మ, సునీల్, సంగాలకు చెందిన రాజు, గుండ్రేవులకు చెందిన సురేష్, ముడుమాలకు చెందిన గోపాల్ పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు.

తెరుచుకోని సచివాలయం తలుపులు



సోమవారం ఉదయం 10:48 గంటలైనా తెరచుకోని సి.బెళగల్ - 1 గ్రామ సచివాలయం

సి.బెళగల్: విధులకు రెగ్యులర్‌గా హాజరవడంతోపాటు, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండల అధికారులతో పాటు, గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు సైతం సమయపాలన పాటించడంలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఆయా కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. సోమవారం ఉదయం 10:48 గంటలైనా సి.బెళగల్ గ్రామ సచివాలయం - 1 తలుపులు తెరచుకోలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు కార్యాలయం బయటే ఉద్యోగుల కోసం ఎదురు చూశారు. మండల కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లా అధికారులు మండల కార్యాలయాలు, సచివాలయాలపై పర్యవేక్షణ పెంచి ఉద్యోగులు సమయపాలన పాటించేలా, కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఘటనపై మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులును వివరణ కోరగా ఉద్యోగులు 10:30 గంటల్లోపు విధులకు హాజరుకావాలని, విధుల పట్ల అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



పంచలింగాల బీసీ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు

రోడ్డుపైనే మురుగు

కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. పంచాలింగాల గ్రామం బీసీ కాలనీలో డ్రైనేజీలు లేనందున మురుగునీరు ఇళ్ల ముందే పారుతుడటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ కాలనీ మీదుగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. మురుగు నీటి వల్ల దోమలు, విషకీటకాల బారినపడి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సమస్యను విన్నవించినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీసీ కాలనీలో డ్రైనేజీ నిర్మించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భోగేశ్వరంలో సంప్రోక్షణ పూజలు



భోగేశ్వరస్వామి

గడివేముల: గడిగరేవుల గ్రామంలో ని దుర్గా భోగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం చంద్రగ్రహణం అనంతరం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో అర్చకుడు గిరినాథ్ శర్మ ఉదయం స్వామి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

శుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న

కోడుమూరు రూరల్: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని కోడుమూరు కోలోకేటెడ్ వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న సూచించారు. సోమవారం మండలంలోని కల్లపరి హైస్కూల్‌ను వైద్యబృందం సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ.. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను శుభ్రపరచుకోవాలన్నారు. పాఠశాలలో భోజనం వండే సిబ్బంది కూడా వంట చేసే ముందు పాత్రలను, చేతులను శుభ్రపరచుకోవాలని, నాణ్యత ఉన్న ఆహార పదార్థాలకు విద్యార్థులకు అందించాలన్నారు. హెచ్ఎం శాంతమూర్తి, వైద్య సిబ్బంది కమల్‌సాహెబ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఓర్వకల్లు: రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను నిర్ణీత ధరలకే విక్రయించాలని విజిలెన్స్ ఏఓ విశ్వనాథ్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఓర్వకల్లు మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి మధుమతితో కలిసి ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులకు కేటాయించిన ఎరువుల రకాలు, విక్రయాలు, మిగిలిన నిల్వలపై వివరాలు తీసుకున్నారు. మొత్తం రికార్డులు సక్రమంగా ఉన్నప్పటికీ, శనివారం విక్రయాల వివరాలు నమోదు చేయలేదని గుర్తించారు. దీనిపై ప్రశ్నించగా ఆదివారం సెలవు కారణంగా రికార్డుల్లో చేర్చలేకపోయినట్టు డీలర్లు తెలిపారు. ఎరువుల వివరాలు నమోదు పూర్తయ్యే వరకు విక్రయాలు తాత్కాలికంగా నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. మండలానికి ఇప్పటివరకు 857 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, వాటిలో 755 మెట్రిక్ టన్నుల విక్రయం జరిగిందని, ఇంకా 102.5 మెట్రిక్ టన్నులు ఆర్ఎస్‌కేలు, డీలర్ల వద్ద నిల్వగా ఉన్నాయని ఏఓ మధుమతి తెలిపారు. మార్క్‌ఫెడ్ గోడౌన్లలో 2230 టన్నుల బఫర్ స్టాక్ ఉందని, యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఇళ్ల స్థలాలకు నంబర్లు వేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: నన్నూరులో పేదలకు మంజూరైన ఇళ్ల స్థలాలకు వెంటనే గుర్తింపు నంబర్లు వేసి, లబ్ధిదారులకు స్థలాలు చూపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆందోళన నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేసినప్పటికీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 15 నెలలైనా నంబర్లు వేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. లబ్ధిదారుల నుంచి ఆధార్, రేషన్ కార్డులు తీసుకున్నా ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించగా, 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సీపీఎం నాయకులు మధుసూదన్, నాగన్న, మల్లేష్, రామకృష్ణ, ఆకుల మధు, రామాంజనేయులు, రాము తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులపై అక్రమ కేసులు సిగ్గుచేటు!

- ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- రైతులపై ఎమ్మెల్యే చౌకబారు ఆరోపణలు తగదు

కోడుమూరు రూరల్: కష్టపడి పండించిన ఉల్లి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఆత్మహత్యాయత్నానికి యత్నించిన రైతులను వేధిస్తూ వారిపైనే అక్రమ కేసులు పెట్టడం ప్రభుత్వానికి సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాయర్ ప్రభాకర్ విమర్శించారు. ఆయన సోమవారం కోడుమూరులో మాట్లాడుతూ.. ఉల్లికి గిట్టుబాటు ధర లేక, పంటకు పెట్టిన పెట్టుబడిలో పదో వంతు కూడా దక్కకుండా పోతుండటంతో ఆవేదన చెంది సి.బెళగల్ మండలం పోలకల్‌కు చెందిన క్రిష్ణ, వెంకటనాయుడు అనే రైతులు రెండు రోజుల కిందట పురుగు మందు సేవించి ఆత్మహత్యకు యత్నించారన్నారు. వారిపై సానుభూతి చూపి ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం ఆ పని చేయకపోగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతులపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలుగా పేర్కొంటూ అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. ఇది కూటమి ప్రభుత్వ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. పోలకల్ రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో జరుగుతున్న మోసాలపై ప్రభుత్వం దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే ఆరోపణలు సిగ్గుచేటు

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలంటూ పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన పోలకల్ రైతులకు అండగా నిలవాల్సిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి రైతులపైనే అభాండాలు వేస్తూ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని లాయర్ ప్రభాకర్ విమర్శించారు. చేతనైతే ఉల్లి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేయాలి గానీ, ఎమ్మెల్యే అయి ఉండి ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం తగదని ప్రభాకర్ సూచించారు.

పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ వెంకటలక్ష్మి నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్)కు మండల రైతుల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. సి.బెళగల్, పోలకల్, బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి, గుండ్రేవుల, ఇనగండ్ల, కంబదహాల్, ముడుమాల గ్రామాలకు చెందిన పలువురు రైతులు భూముల కొలతలు చేపట్టాలని, భూముల ఆన్‌లైన్ సమస్యల ను పరిష్కరించాలని, భూములపై హక్కులు కల్పించాలని, ఆక్రమణల నుంచి రక్షణ కల్పించాలని, జాయింట్ ఎల్‌పీఎంలను తొలగించాలని అర్జీలు ఇచ్చారు. ఈర్లదిన్నె మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి తమ భూములపై ఇతరులకు హక్కులు కల్పించారని, వాటిని రద్దు చేయాలని అర్జీలో కోరారు. అర్జీలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ అన్నారు. డీటీ పురుషోత్తం, ఏఓ మల్లేష్‌కుమార్, సర్వేయర్ నాగభూషణం, ఆర్ఐ తరుణ్, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ సైతం పీజీఆర్ఎస్ నిర్వహించగా డి ప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, వెంకటప్రకాష్, సు మంత్,ఎంఈఓ జ్యోతి, తదితరులు హాజరయ్యారు.

రోడ్లపై గుంతలు అధికారులకు కనిపించవా?



కోడుమూరులో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: కోడుమూరులో ప్రధాన రహదారులపై ఏర్పడ్డ గుంతలు అధికారులకు కనిపించవా అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు ప్రశ్నించారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కోడుమూరులోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్లో సీపీఐ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రధాన రోడ్లపై భారీ గుంతలేర్పడినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారని, రోడ్డుపై రేగే దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులకు పట్టదా అని ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని, లేకపోతే ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయంలోని ఖాళీ కుర్చీకి అతికించి నిరసనను తెలియజేశారు. సీపీఐ నాయకులు శేషుకుమార్, సలాం, వాసు, గిరి, నరసింహ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు మారినా.. పేర్లు మారలే!



పీహెచ్‌సీలోని సమాచార హక్కు చట్టం బోర్డులో పాత పేర్లు

గడివేముల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమాచార హక్కు చట్టం వివరాల బోర్డులో బదిలీపై వెళ్లిపోయిన పాత అధికారుల పేర్లే దర్శనం ఇస్తున్నాయి. సమస్యలతో వచ్చిన ప్రజలు ఎవరికి తెలియజేయాలో తెలియక తికమక పడుతున్నారు. కొన్నేళ్ల కిందట బదిలీపై వెళ్లిన డాక్టర్, సీహెచ్ఓ పేర్లనే బోర్డులో ఉంచేశారు. ఆ స్థానంలో కొత్తగా అధికారులు వచ్చినా వివరాల బోర్డులో మాత్రం మార్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డులో సమాచార, సహ సమాచార అధికారుల పేర్లు మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులతో పనులు.. తల్లిదండ్రుల ఆగ్రహం



మరుగుదొడ్డి గదులపై శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పాణ్యం: మండలంలోని ఆలమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో మరుగుదొడ్లను శుభ్రం చేయించడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల గదిపై పేరుకుపోయిన నీరు, పాచిని పిల్లలతో శుభ్రం చేయించారు. మరుగుదొడ్డిపైకి ఎక్కి విద్యార్థులు సలికెపారతో కడిగి, తరువాత పెరకతో ఊడ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఇలాంటి పనులు విద్యార్థులతో చేయించడం ఏంటని మండిపడ్డారు. ఈ విషయంపై ఎంఈఓ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా పూర్తి స్థాయిలో విచారణ జరిపి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం అని తెలిపారు.